ధకంలో జరిగే ఘోరాలు కొన్ని తెలిపేటప్పుడు రాజ్యం మనస్సు కరిగిపోయేది. ఆ దురాచారాలఫలితంగా గంగపాలైన జీవితాలను గురించి విని ఆమె అశ్రువులు విడుస్తూవుండేది.

నారాయణమూర్తి సంఘసంస్కరణానికి ముందడుగు వేసిన వాళ్లలో ఒకడు. అసలు అతను మొదట శుద్ధఛాందసుడు. అతను వద్దంటున్నా వినక బంధువులంతా అతన్ని ప్రోత్సాహంచేసి, శాస్త్రి లు మాటలంచి రాజ్యానికి రజస్వలకారేటట వివాహం చేయించారు. కాని పెళ్లయిన నాలుగు నెల్లలో అల్లుణ్ని మహామారికం పొట్టబెట్టుకుంది. ఆదెబ్బతిన్న తరవాత నారాయణమూర్తికి బంధువులంటే మోహం చెరిగింది. ఇప్పుడు ముద్దుకుమార్తె యౌవనవతియై పదవనిపేన బాధలు వాళ్లకేం తెల్సు? తనకేగానీ?

అందుచేత అతను పూర్తిగా మారి ప్రబలమైన సంఘసంస్కర్త అయిపోయినాడు. కుమార్తెను విద్యావతిని చేసి, పదెనిమిదేళ్ల వయస్సు రాగానే మళ్లా వివాహం చేద్దామనే ఉద్దేశం అతని హృదయకుహరాల్లో దాగునివుంది. రాజ్యలక్ష్మికి తనపెళ్లి ఎప్పుడు ఏలాగు జరిగిందో జ్ఞాపకమే లేదు. తండ్రికీ, బంధువులకీ తనవివాహవిషయంలో జరిగిన రాద్ధాంత సిద్ధాంతాలు తరుచు విన్నందువల్ల సంస్కరణాలవల్ల ఉపయోగం ఆమెకే బాగా తెలుసును.

## ౨

రెండు నెలలు గడిచేయి. రంగాచారి బి. యే. పరీక్షలో కృతార్థుడైనట్లు తెలిసింది. ఆనాడు నారాయణమూర్తికుటుంబాన్ని ఆచార్లుగారు విందుకి పిలిచారు. రంగాచారి విందు ఉత్సాహంతో వున్నాడు. ఆరోజున రాజ్యం ద్విగుణీకృతసౌందర్యంతో అతనికి కనబడింది. పచ్చని వలవచేసిన సేలం జరీ సిల్కుచీర కట్టుకుంది. ఎర్ర సిల్కు జాకెట్టు తొడుక్కుంది. జాకెట్టును దాటి ఆమె కేశకాంతులు మున్మురంగా పైకి వస్తున్నాయి. మల్లెపువ్వులు కట్టుకున్న వాలు జడ కటిపర్యంతమూ వేలాడుతూంది. మందహాసపరిశోభితమై ముఖం కలకలలాడుతూంది. ప్రభాతసూర్యునికాంతిలో ముద్దులు గుల్కు గులాబీపువ్వుల్లాగు ఆమె చెక్కులు కాంతివంతములై వున్నాయి. వసంతాగమమున లలితారుణపల్లవ భూషణోజ్వలిత మగు లేమామిడివున్నలాగు ఆమె అందము నేత్రపర్వమై, లక్ష్మీదాయకమై వుంది.

ఆవందాతిరేకాన్ని రంగాచారిశరీరం రోమాంచితమైపోయింది. అంతవరకూ మనస్సులో అణిగివున్న ప్రేమ ఒక్కసారిగా పైకి పొంగిపోయింది. ఆమె ఒంటిగా వున్న సమయం కనిపెట్టి, "రాజ్యం! నీపరీక్షకూడా ప్యాసైతే మమ్మల్ని విందుకు పిలుస్తావా?" అనకుండా వుండలేకపోయినా డతను. "ఇప్పుడు మమ్మల్ని పిల్చినందుకు బదులా యేమిటి?" అంటూ చిరునవ్వుతో ఆమె వెళ్లిపోయింది. ఆమె వెళ్లి



"రాజ్యం నీపరీక్షకూడ........విందుకు పిలుస్తావా?"

పోయినాగాని ఆజవాబుమాత్రం అతనిచెవుల్లో కోకిలపలుకుల్లాగు,— రామచిలకలరొదలాగు,— మనోహర వీణాస్వరంలాగు — రింగుమంటూనేవుంది.

రాజ్యానికి తన అభిలాష చెప్పాలని రంగాచారి అనేకసార్లు ప్రయత్నించాడు. కాని జంకుచేత మళ్లా మానుకున్నాడు. తనకోర్కె నోటితో చెప్పలే దన్నమాట గాని అతని ప్రతిమాటా, ప్రతిచేష్ట అతనిప్రేమను వెయ్యినోళ్లతో చాటుతున్నాయి.

ఒకనాటిసాయంత్రం రంగాచారీ, రాజ్యమూ వాలాహారం సికారుపోయారు. అక్కడ ఒకకొండగెడ్డ గోదావరిలో కలుస్తూంది. ఆగెడ్డఒడ్డున ఒకరాపరాతిమీద వాళ్లిద్దరూ కూర్చున్నారు.

సూర్యుడు గోదావరి అవలివైపు పర్వతాల్లోకి క్రమంగా దిగిపోతున్నాడు. అతని దివ్యతేజము గౌతమీ విమలజలాల్లో ప్రతిఫలిస్తూంది. కొండలమీద వివిధఫలవృక్షాలమీద వాలి పక్షులు సంతోషంతో చేస్తూవున్న రొదలు పెళ్లివారింట్లో గందరగోళంలా నుంది. గోదావరి మందంగా ప్రవహిస్తూంది. గెడ్డలో నీరు రాళ్లమీద కొట్టు

